సాక్షి
అనంతపురం
సోమవారం । 25 । ఆగస్టు । 2025



'ఎకో'దంతుడికి జై
ఏకదంతుడు క్రమంగా 'ఎకో' దంతుడవుతున్నాడు. మట్టి వినాయక ప్రతిమల వైపు జిల్లావాసులు మొగ్గు చూపుతున్నారు.
8లో



టమాట కిలో రూ.34
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.34 పలికింది. కనిష్టం రూ.27, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.2°/21.6°
జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. అర్జీ స్థితిని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీలను పరిష్కార వేదికలోనే కాకుండా meekosam. ap. gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేడు జిల్లా సమీక్ష సమావేశం

అనంతపురం అర్బన్: జిల్లా సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశం సోమవారం జరగనుంది. జిల్లా ఇన్‌చార్జ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధ్యక్షతన మధ్యాహ్నం 2.45 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించనున్నారు. డీఆర్‌సీ సమావేశానికి సమగ్ర వివరాలు, సమాచారంతో హాజరు కావాలని అన్ని శాఖల జిల్లా అధికారులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

వచ్చే నెలలో సీఎం జిల్లా పర్యటన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అనంతపురం ఎడ్యుకేషన్/గార్లదిన్నె: ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబర్ మొదటివారంలో జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ ఆదివారం అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలాల్లో స్థలాలను పరిశీలించారు. అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరు వద్ద (అనంతపురం - కదిరి జాతీయ రహదారి పక్కన), అనంతపురం- బెంగళూరు జాతీయ రహదారి పక్కన రాప్తాడు మండలంలోని ఎంఐజీ లేఔట్ వద్ద స్థలాలను పరిశీలించారు. అనంతరం గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామం (అనంతపురం-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన) వద్ద స్థలాన్ని పరిశీలించారు. ప్రజలకు వీలుగా అనంతపురం నగరానికి దగ్గరలో మరికొన్ని చోట్ల స్థలాల్ని పరిశీలించాలని ఆర్డీఓ, తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లను పిలిపించి సంబంధిత స్థలాల స్కెచ్‌లను సిద్ధం చేసి నివేదించాలని సూచించారు. వారివెంట అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు, అనంతపురం, అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలాల తహసీల్దార్లు హరి కుమార్, మోహన్ కుమార్,ఈరమ్మ, ఇటుకలపల్లి పీఎస్ ఎస్ఐ విజయ్ కుమార్ ఉన్నారు.

'మామూళ్ల మత్తు'తో గం'జాయ్'



- కదిరిలో ఇటీవల గంజాయి డంప్ లభ్యం
- కేసులో అసలు నిందితులను తప్పించేందుకు పోలీసుల భారీ డీల్
- ఓ హోటల్ యజమానితో రూ.25 లక్షల బేరం
- గంజాయి సరఫరాలో బీజేపీ నేత కుమారుడి హస్తం
- తిమ్మిని బమ్మిని చేస్తున్న పోలీసు అధికారి
- గంజాయి అమ్మకాలకు అడ్డాగా మారిన కదిరి, తాడిపత్రి నియోజకవర్గాలు



ఈ నెల 22న పట్టుబడిన గంజాయి డంప్, నిందితులను చూపుతున్న కదిరి పోలీసులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గంజాయి ఒక్కసారిగా గుప్పుమంది. అంతా ఇంతా కాదు ఒకేసారి 50 కేజీలకు పైగా లభించింది. గంజాయి సరఫరా చేసినా, సేవించినా పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టి శిక్షిస్తామంటున్న పోలీసులే నిందితులను తప్పించే యత్నం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు భారీగా డీల్ కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. కదిరి కేంద్రంగా జరిగిన ఈ గంజాయి స్కామ్‌లో ఓ పోలీసు అధికారి కీలక పాత్ర పోషించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గంజాయి బ్యాచ్ ఆగడాలతో తాడిపత్రి పట్టణంలో మహిళలు హడలెత్తిపోతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కదిరిలో గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువ కావడం సర్వత్రా ఆందోళనకు గురి చేస్తోంది.

హోటల్ యజమానితో భారీ బేరం..

మూడు రోజుల క్రితం కదిరి మండలం కొండమనాయునిపాలెం వద్ద భారీ గంజాయి డంప్ స్వాధీనమైంది. కానీ దొరికిన గంజాయి తక్కువ మోతాదులో ఉన్నట్టు చూపించారు. ఇందులో ఓ హోటల్ యజమాని హస్తం ఉంది. గంజాయి తెచ్చిన ఇన్నోవా కారుకు పోలీసు అని ఉండటంతో ఖాకీలు జాగ్రత్త పడ్డారు. హోటల్ యజమానికి సమీప బంధువైన ఏఆర్ కానిస్టేబుల్ ఒకరు పోలీసు స్టిక్కర్ వేసుకుని తిరుగుతుంటారు. అదే కారులో గంజాయి తెచ్చారు. కానీ ఈ కేసులో మిగతా ఆరుగురిని అరెస్టు చూపించిన పోలీసులు హోటల్ యజమానిని తప్పించారు. ఈ కేసు బయటపడిన రోజే హోటల్ యజమాని ఓ ప్రజాప్రతినిధి ఇంటికెళ్లి ఆయన్ను కలిసినట్టు తెలిసింది. కేసు నుంచి హోటల్ యజమానిని తప్పించేందుకు రూ.25 లక్షల బేరం కుదిరినట్టు సమాచారం. ఇలా గంజాయి నిందితులు కదిరి పోలీసులకు మంచి ఆదాయవనరుగా మారారని చెప్పుకోవచ్చు. ఇక.. ఇటీవల కదిరి సమీప ప్రాంతంలో రెండు వర్గాలకు చెందిన యువకులు కొట్టుకున్నారు. వెంటనే వారి తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలు గంజాయికి బానిసలయ్యారు కాబట్టే ఇవన్నీ చేస్తున్నారని వాపోయారు. పోలీసులు మాత్రం అదేమీ లేదని కొట్టిపారేయడం గమనార్హం.

పోలీసు అధికారి అన్నీ తానై..

గంజాయి అమ్మకాలకు ఇటీవల కదిరి అడ్డాగా మారింది. మొన్నటికి మొన్న పట్టణంలోని కాలేజ్ సర్కిల్‌లోని ఓ ఇంట్లో గొడవ జరగ్గా.. ఓ వ్యక్తి నేరుగా పోలీసుల దగ్గరికి వెళ్లి తమ రూములో కొంతమంది గంజాయి అమ్ముతున్నారని ఫిర్యాదు చేశాడు. అయితే, ఎవరికీ తెలియకుండా నేరుగా అక్కడికి వెళ్లిన ఒక పోలీసు ఉన్నతాధికారి ఈ వ్యవహారంలో ఓ బీజేపీ నేత కుమారుడి హస్తం ఉన్నట్లు గుర్తించారు. ఆ వ్యక్తిని గంజాయి కేసు నుంచి తప్పించారు. ఇందుకోసం హిందూపురం పార్లమెంటు పరిధిలోని ఓ టీడీపీ నేత సదరు పోలీసు అధికారికి ఫోన్ చేశారని, రూ.10 లక్షల డీల్ కుదిరిందని తెలుస్తోంది.

పరిస్థితి అదుపు తప్పుతోంది..

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో పరిస్థితి అదుపు తప్పుతోంది. ఊరూరా బెల్టుషాపుల తరహాలోనే నేడు గ్రామగ్రామన గంజాయి లభిస్తోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, కదిరి, ధర్మవరం ప్రాంతాలకు విచ్చలవిడిగా గంజాయి సరఫరా అవుతున్నట్టు తేలింది. ఎక్కువగా పాతికేళ్లలోపు యువకులు గంజాయి మత్తులో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి. ప్రస్తుతం రిటైల్‌గా 50 గ్రాముల గంజాయి రూ.1,000 వరకూ అమ్ముతున్నట్టు తేలింది. పోలీసులే డబ్బు తీసుకుని గంజాయి విక్రేతలను వదిలేస్తుంటే పరిస్థితి అదుపు తప్పక ఏమవుతుందని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: దసరా, దీపావళి పండుగలకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్-తిరుపతి మధ్య వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ జంక్షన్ (07009) నుంచి సెప్టెంబర్ 4- సెప్టెంబర్ 25వ తేదీ వరకు ప్రతి గురువారం (4 సర్వీసులు) రైలు తిరుగుతుందన్నారు. తిరుపతి జంక్షన్ (07010) నుంచి సెప్టెంబర్ 5-సెప్టెంబర్ 26 వరకు ప్రతి శుక్రవారం నడుపుతున్నట్లు పేర్కొన్నారు. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి. రైళ్లలో ఫస్ట్ క్లాస్ కమ్ సెకండ్ ఏసీతోపాటు 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎక్కడికి వెళ్లినా నోస్టాక్ బోర్డులే !

- ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలు, డీసీఎంఎస్ వద్ద లభించని యూరియా
- రీటైల్ డీలర్ల దగ్గర కొంత ఉన్నా బయటకు తీయని వైనం
- యూరియా దొరక్క వరి, మొక్కజొన్న, అరటి రైతుల అవస్థలు



అనంతపురంలోని డీసీఎంఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతుల బారులు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా అంతటా యూరియా నోస్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలు, డీసీఎంఎస్‌లకు తగినంత సరఫరా చేసినట్లు 'మార్క్‌ఫెడ్' చెబుతున్నా ఎక్కడా బస్తా కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ప్రైవేట్ హోల్‌సేల్, రీటైల్ డీలర్లకు అవసరమైనంత ఇచ్చామని వ్యవసాయశాఖ అంటున్నా... వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ ఏప్రిల్ నుంచి జిల్లాకు చేరిన 14,286 మెట్రిక్ టన్నులతో పాటు గత ఖరీఫ్, రబీ మిగులుగా ఉన్న 15,241 మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కడికి వెళ్లిందో తెలియడం లేదు. అయితే, ఇందులో సగానికి సగం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతలతో పాటు అధికారులు కుమ్మక్కై తమకు యూరియా లభించకుండా చేశారని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, అరటి సాగు చేస్తున్న రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాకు చేరిన యూరియా నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దు జిల్లాలతో పాటు సరిహద్దు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున తరలించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పరిస్థితి చేయిదాటాక రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం హడావుడి చేస్తుండటంతో రైతులు విస్తుపోతున్నారు.

సెప్టెంబర్‌లో మరింత డిమాండ్..

ఆగస్టు రెండో పక్షం నుంచి యూరియా వాడకం ఎక్కువగా ఉంటుంది. సెప్టెంబర్‌లో మరింత డిమాండ్ ఉంటుందని రైతులు చెబుతున్నారు. వరి, మొక్కజొన్న, అరటితో పాటు వేరుశనగ, కంది, పత్తి తదితర పంటలకు కూడా యూరియా వేసుకుంటారు. అధికారులు చెబుతున్నట్లు జిల్లా అంతటా జల్లెడ పట్టినా 500 మెట్రిక్ టన్నులు కూడా కనిపించడం లేదు. బఫర్‌స్టాక్ కింద 1,069 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు చెబుతున్నా అది ఎప్పుడు బయటకు తీస్తారో చెప్పడం లేదు. రెండు మూడు రోజుల్లో సరఫరా కాకపోతే సమస్య తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ వారంలో 'స్పిక్' కంపెనీకి చెందిన యూరియా రావొచ్చని సమాచారం. మార్క్‌ఫెడ్ నుంచి ఈ ఏప్రిల్ నుంచి 453 ఆర్‌ఎస్‌కేలకు 3 వేల మెట్రిక్ టన్నులు, అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి డీసీఎంఎస్‌లకు 843 మెట్రిక్ టన్నులు, రెండు ఎఫ్‌పీఓలు, 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 2,200 మెట్రిక్ టన్నుల వరకు సరఫరా చేశామని చెబుతున్నారు. ఇక.. వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్న యూరియా లెక్కలు సరిపోవడం లేదు. ఇరుశాఖల మధ్య వ్యత్యాసం అధికంగా ఉండటంతో యూరియా పక్కదారి పట్టినట్లు స్పష్టమవుతోంది. గార్లదిన్నెలో, మన గ్రోమోర్‌లో, అనంతపురంలో మూడు చోట్ల... ఇలా రీటైల్ షాపులో అక్కడక్కడా యూరియా ఉందని అధికారులు చెబుతున్నా బయటికి మాత్రం రావడంలేదు. ఎంఆర్‌పీకి మించి అమ్ముకునేందుకు హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు అంతో ఇంతో ఉన్న యూరియాను బయటకు తీయకుండా గుట్టుగా వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది జూన్, జూలైలో వ్యవసాయశాఖ పరిధిలో జరిగిన ఏడీఏ, ఏఓ, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ కూడా యూరియా పక్కదారి పట్టడానికి మార్గం సుగమం చేసినట్లు తెలిసింది.

గాల్లో తల్లీబిడ్డ ప్రాణాలు

- జీజీహెచ్‌లో లేబర్ ఓటీ సమస్య
- మధ్యాహ్నం నుంచి మెయిన్ ఓటీకి వెళ్లాల్సిందే
- నిండు చూలాలతో పాటు వైద్యులకూ అవస్థలు



జీజీహెచ్‌లో లేబర్ ఆపరేషన్ థియేటర్

అనంతపురం మెడికల్: అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా తయారైంది ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగం పరిస్థితి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గైనిక్ విభాగం కోసం అత్యాధునిక హంగులతో లేబర్ ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పేదలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం అలసత్వం కారణంగా నేడు లేబర్ వార్డు మధ్యాహ్నం వరకు మాత్రమే నడుస్తోంది. జనరేటర్ సాకు చూపుతూ సిజేరియన్లను మెయిన్ ఆపరేషన్ థియేటర్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో నిండుచూలాలతో పాటు వైద్యులకూ అవస్థలు తప్పడం లేదు.

పరుగులు పెట్టాల్సిందే..

ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో సిజేరియన్లు చేసేవారు. ఇటీవల అక్కడ క్యాజువాలిటీ విస్తరణ చేపడుతుండడంతో ఎమర్జెన్సీ కేసులను ఆపేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో మెయిన్ ఓటీకి తరలించాల్సి వస్తోంది. వాస్తవంగా లేబర్ ఆపరేషన్ థియేటర్‌లోనే అన్ని సదుపాయాలున్నాయి. కానీ గర్భిణులను అత్యవసరం పేరిట ఇబ్బందులు పెడుతూ మొదటి అంతస్తులో ఉన్న మెయిన్ ఓటీకి తీసుకెళ్తుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా గైనిక్ వార్డు ఉన్న ప్రాంతంలోనే లేబర్ ఓటీ ఏర్పాటు చేశారు. అత్యవసర కేసు 20 నిమిషాల్లోపు ఓటీకి తీసుకెళ్లి సిజేరియన్ చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం ఆస్పత్రిలో సీరియస్ కేసులను మెయిన్ ఓటీకి తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో ఆక్సిజన్, ఇతర పరికరాలను వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చిన్న పొరపాటు జరిగినా తల్లీ,బిడ్డ ప్రాణాలకే ప్రమాదం లేకపోలేదు.

నెలకు 700 నుంచి 800 ప్రసవాలు..

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు సర్వజనాస్పత్రి పెద్ద దిక్కు. సాధారణ కేసుల నుంచి కష్టతరమైన కేసులన్నీ ఇక్కడికి వస్తుంటాయి. రోజూ 20 నుంచి 30 ప్రసవాలు జరుగుతాయి. అందులో 5 నుంచి 6 వరకు సిజేరియన్లు ఉంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి గర్భిణులకు ఇబ్బంది కలగకుండా లేబర్ ఓటీలోనే సిజేరియన్లు జరిగేలా చూడాలని గైనిక్ విభాగానికి చెందిన పలువురు కోరుతున్నారు. ఆ విభాగం వైద్యులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రోజంతా ఎదురుచూపులు

- డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు రాని మెసేజ్‌లు
- డైరెక్టరేట్ నుంచి కూడా స్పష్టమైన సమాచారం కరువు
- నేటి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా వేసినట్లు డీఈఓ ప్రకటన



అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నేరుగా వారి వ్యక్తిగత మొబైళ్లకు మెసేజ్‌లు వస్తాయని ప్రకటించడంతో డీఎస్సీ-25కు ఎంపికైన అభ్యర్థులు ఆదివారం రోజంతా ఎదురు చూశారు. రాత్రి 10 గంటలైనా ఏ ఒక్కరికీ సమాచారం అందలేదు. మరోవైపు సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు సంబంధించి నగర శివారులో ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచి డీఈఓ అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మరోవైపు ఇక్కడి అధికారులకు కూడా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై డైరెక్టరేట్ నుంచి స్పష్టమైన సమాచారం అందలేదు. రాత్రయినా స్పష్టత లేకపోవడంతో అయోమయం నెలకొంది. ఓవైపు మెరిట్‌లో మంచి ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు, మరోవైపు అధికారుల్లో టెన్షన్ పట్టుకుంది. సాంకేతిక సమస్యలు, ఇతర సమస్యల కారణంగా ఎంపికైన అభ్యర్థులకు మెసేజ్‌లు పంపలేకపోతున్నట్లు ఉన్నతాధికారులు స్పష్టత ఇచ్చారు. ఆర్జేడీ ఆదేశాలతో సోమవారం జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలనను వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు ప్రకటించారు. తర్వాత రోజు (మంగళవారం) ఉండొచ్చని ఇక్కడి అధికారులు అంచనా వేస్తున్నా... సోమవారం దీనిపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

గ్రానైట్.. రైట్‌రైట్

- జోరుగా అక్రమ తవ్వకాలు
- కన్నెత్తి చూడని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



పీఏబీఆర్ పరిసరాల్లో హిటాచీతో తవ్వకాలు చేపడుతున్న దృశ్యం



తరలించేందుకు సిద్ధం చేసిన గ్రానైట్ రాళ్లు

కూడేరు: మండలంలోని కొర్రకోడు రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 127లో గల నల్లగుట్టలో గ్రానైట్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. నల్లగుట్ట సుమారు 5 ఎకరాలకు పైగా విస్తరించింది. ఇక్కడ విలువైన గ్రానైట్ రాయి ఉండడంతో నంద్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి కన్నేశాడు. హిటాచీలు, జేసీబీలు పెట్టి కొన్ని రోజులుగా డ్రిల్లింగ్ యంత్రాలతో పెద్ద పెద్ద రాళ్లను బయటకు తీయిస్తున్నాడు. కార్మికులు ఈ ప్రాంతంలో టెంట్లు వేసుకుని పగలంతా రాళ్లను బయటకు తీసి అనంతరం బ్లాక్‌లుగా కత్తిరిస్తున్నారు. రాత్రి వేళ గుట్టు చప్పుడు కాకుండా భారీ వాహనాల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

పట్టని అధికారులు..

పట్టపగలే గ్రానైట్ కార్యకలాపాలు సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. అక్రమ గ్రానైట్ తవ్వకాలు, రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇప్పటికే ఇక్కడ సుమారు 2 వేల క్యూబిక్ మీటర్ల వరకూ తవ్వకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. సాధారణంగా క్యూబిక్ మీటర్ తవ్వకానికి రూ.4,800 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. ఈ లెక్కన ప్రభుత్వానికి రూ.10 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు సమాచారం. నెల రోజులుగా పీఏబీఆర్, మండల కేంద్రానికి దగ్గర్లో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రానైట్ తవ్వకాలు సాగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతోనే తవ్వకాలు చేపడుతున్నారని తెలిసింది.

ఎలాంటి అనుమతి ఇవ్వలేదు



కొర్రకోడు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 127లోని నల్లగుట్టలో గ్రానైట్ తవ్వకాలకు రెవెన్యూ శాఖ ద్వారా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా గ్రానైట్ తవ్వకాలు చేపట్టకూడదు. వారి వద్ద అనుమతులు ఏమున్నాయో విచారించాలని వీఆర్వోలను ఆదేశించాం. నిబంధనలు అతిక్రమించి ఉంటే చర్యలు తీసుకుంటాం.

– మహబూబ్ బాషా, తహసీల్దార్, కూడేరు మండలం

క్లుప్తంగా

రచ్చకట్ట కోసం రచ్చరచ్చ

- రెండు వర్గాలుగా విడిపోయి పీఎస్ ఎదుటనే తలపడిన టీడీపీ నేతలు


కళ్యాణదుర్గం పీఎస్ ఎదుట వాగ్వాదానికి దిగిన టీడీపీ నేతలు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని దేవాదులకొండ గ్రామంలో రచ్చకట్ట వివాదం తారస్థాయికి చేరుకుంది. గ్రామ నడిబొడ్డున పూర్వీకులు ఏర్పాటు చేసిన రచ్చకట్ట శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు ఏకమై పునరుద్ధరణ పనులు చేపట్టారు. టీడీపీలోని ఓ వర్గం వారు చేపట్టిన ఈ పనులను అదే పార్టీకి చెందిన మరో వర్గం అడ్డుకుంది. దీంతో వివాదం ముదిరి ఆదివారం పోలీసుస్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదులు అందజేశారు. ఆ సమయంలో ఇరువర్గాల టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. పీఎస్ ఎదుటనే తలపడిన టీడీపీ నేతలను సముదాయించడం పోలీసులకు తలకు మించిన భారమైంది. వివాదానికి పరిష్కారం చూపలేక చివరకు గ్రామస్తుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, సమస్యకు పరిష్కారం చూపుతామని సర్దిచెప్పి పంపారు.

డీఎస్సీ ఫలితాల్లో మూడు పోస్టులకు అర్హత


సాయిచందన

కళ్యాణదుర్గం రూరల్: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో కంబదూరుకు చెందిన ముత్యాలప్ప కుమార్తె సాయిచందన ఏకంగా మూడు పోస్టులకు అర్హత సాధించారు. టీజీటీ బయాలజీ జోన్-4లో 81.79 మార్కులతో 5వ ర్యాంక్, జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 83.13 మార్కులతో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 84.54 మార్కులతో 84వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా సాయిచందనను పలువురు అభినందించారు.

రైతు కూలీ బిడ్డకు డీఎస్సీలో ఐదో ర్యాంకు


ఈరనారప్ప

బత్తలపల్లి: మండల కేంద్రంలో నివాసముంటున్న బాలగొండ ఈరనారప్ప డీఎస్సీ ఫలితాల్లో ఐదో ర్యాంక్ సాధించాడు. ఈరనారప్ప తల్లిదండ్రులు నారాయణస్వామి, నారమ్మ దంపతులు సాధారణ రైతు కూలీలు. వీరిది రాప్తాడు మండలం బండమీదపల్లి స్వగ్రామం. 15 సంవత్సరాల క్రితం బత్తలపల్లికి వలస వచ్చి ఇక్కడే ఉంటున్నారు. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) విభాగంలో జిల్లా స్థాయిలో ఐదో ర్యాంక్‌తో పాటు టీజీటీలో 114వ ర్యాంకు, పీజీటీ విభాగంలో 94వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటిన ఈరనారప్పను పలువురు అభినందించారు.

ఏకోదంతుడికి జై



- ఈ నెల 27 నుంచి వినాయక చవితి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న గణనాథుడు
- మట్టి ప్రతిమలనే పూజిద్దామంటూ పిలుపు
- జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు

ఏకదంతుడు.. క్రమంగా 'ఏకో'దంతుడవుతున్నాడు.. మట్టి గణపతికి జై.. రంగు ప్రతిమలకు బై.. అంటుంటడమే కాదు.. మట్టి విగ్రహాలకే మొక్కుదామని జిల్లా వాసులు పిలుపునిచ్చారు. నీటి వనరుల కాలుష్యాన్ని పెంచుతున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) మోజు నుంచి బయటపడాలని కోరుతున్నారు.


విభిన్న రూపాల్లో తయారైన మట్టి ప్రతిమలు


అమ్మకానికి సిద్ధమైన వినాయకుడి విగ్రహాలు

రాయదుర్గం/అనంతపురం కల్చరల్: తొలి పూజకు గణనాథులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27 నుంచి వినాయక చవితి ఉత్సవాలకు పల్లె, పట్టణాలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భారీ విగ్రహాల ఏర్పాటుకు వేదికలను సిద్ధం చేసి గణనాథుడి పూజకు సిద్ధమయ్యారు. జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం నియోజకవర్గాల పరిధిలో సుమారు ఐదు వేలకు పైగా పందిళ్లు వెలసినట్లు సమాచారం. ఉత్సవాలు మొదలైనప్పటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకూ ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. గణనాథుడి ఉత్సవాల నిర్వహణలో కమిటీలే కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వాహక కమిటీ సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

మట్టి ప్రతిమలే మేలు..

ఆరు నెలలైనా నీటిలో కరగని పీఓపీ వినాయక ప్రతిమలకంటే మట్టి వినాయకులనే పూజించడం శ్రేష్టమని పలువురు పర్యావరణ వేత్తలు పిలుపునిస్తున్నారు. వినాయక చవితికి ఇంకా రెండు రోజులుండగానే జిల్లా వ్యాప్తంగా విగ్రహాల సందడి పెరిగింది. ఈ క్రమంలో కంటికి అందంగా కనిపించే పీఓపీ విగ్రహాలపై ప్రజలను చైతన్యపరిచేలా మట్టి వినాయక ప్రతిమల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మట్టితో చేసిన ప్రతిమలను పూజించి నిమజ్జనం చేస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు. పూర్వం చెరువుల నుంచి మట్టిని సేకరించి విగ్రహాలను తయారు చేసేవారు. తద్వారా చెరువుల్లో కొంత మేర పూడికతీత జరిగేది. పూజల తర్వాత విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసేవారు. పూజల్లో వినియోగించే వివిధ రకాల ఆకుల ద్వారా అనారోగ్య కారక క్రిమికీటకాలు నశించేవి. పీఓపీ విగ్రహాలు నీటిలో కరిగేందుకు ఎక్కువ సమయం పడుతుంది.ఆకర్షణ కోసం ప్రమాదకర రసాయనాలు, రంగులు వినియోగిస్తుండడంతో నీరు కలుషితం అవుతుంది. ఫలితంగా జలచరాల మనుగడ ప్రశ్నార్థకమతుంది. ఆ నీటిని తాగిన మూగజీవాలతో పాటు ప్రజలకూ చర్మసంబంధిత వ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పరిమాణాన్ని బట్టి ధర..

రాజస్తాన్‌కు చెందిన పలువురు కళాకారులు జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో కొన్ని నెలలుగా తాత్కాలిక నివాసాలు ఏర్పరుచుకుని గణనాథుడి ప్రతిమల తయారీలో నిమగ్నమయ్యారు. పండగకు పది రోజుల ముందే విభిన్న రూపాల్లో వినాయకుడి ప్రతిమలు తయారు చేసి సిద్ధంగా ఉంచారు. వీటికి తోడు భక్తుల అభిరుచికి అనుగుణంగా విగ్రహాలను తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. వీటి పరిమాణం, రూపాన్ని బట్టి ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం. నీరు, నేల, జీవ వైవిధ్యం పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. అనుమతుల్లేకుండా విగ్రహాలు ప్రతిష్టించరాదు.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

ఆన్‌లైన్ ద్వారా అనుమతులు

వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తున్నారు. విగ్రహాల ఎత్తు, ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు, ఎప్పుడు నిమజ్జనం చేస్తారు అనే విషయాలను స్పష్టంగా పేర్కొంటూ దరఖాస్తు చేసుకోవాలి. మట్టి ప్రతిమల పూజకే ప్రాధాన్యతనిస్తూ, నిబంధనల మేరకు ఉత్సవాలు నిర్వహించాలి. మంటపాల వద్ద అశ్లీల కార్యక్రమాలు చేపట్టరాదు. ప్రతి మంటపం వద్ద సీసీ కెమెరా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. నిమజ్జన ఊరేగింపుల్లో భక్తి గీతాలు, శాంతి సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మాత్రమే ఉండాలి.

– పి.జగదీష్, ఎస్పీ

ప్రియురాలికి పెళ్లి.. ప్రేమికుడి ఆత్మహత్య


జయకృష్ణ (ఫైల్)

యాడికి: తాను ప్రేమించిన యువతికి మరో యువకుడితో పెళ్లైనట్లు తెలుసుకుని క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన బాలగంగన్న, సుశీల దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడికి వివాహమైంది. చిన్న కుమారుడు జయకృష్ణ (22) ఓ యువతిని ప్రేమిస్తున్నానని.. ఆమెతో తనకు పెళ్లి చేయాలని 3 నెలల క్రితం తల్లిదండ్రులను కోరాడు. అయితే నెల రోజుల క్రితం ఆ యువతికి మరో యువకుడితో ఆమె తల్లిదండ్రులు పెళ్లి చేసినట్లుగా తెలిసింది. దీంతో మనోవేదనకు లోనైన జయకృష్ణ శనివారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం తన గదిలోకి వెళ్లి నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున పిలిచినా స్పందన లేకపోవడంతో మిద్దెపైకి ఎక్కి గవాక్షం నుంచి కుటుంబసభ్యులు చూశారు. అప్పటికే ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న జయకృష్ణను చూసి, బలవంతంగా తలుపులు తీసి మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

శెట్టూరు: కర్ణాటక నుంచి జిల్లాలోకి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎస్ఐ రాంభూపాల్ స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం బచ్చేహళ్లి గేట్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టిన సమయంలో పోలీసులను గమనించి స్కూటీపై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి వాహనాన్ని ఆపి పారిపోయాడు. అనుమానం వచ్చిన పోలీసులు వాహనం దగ్గరకు చేరుకుని పరిశీలించగా 520 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో కొనసాగుతున్న తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు ఊపందుకున్నాయి. ఆదివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని ఆరు దుకాణాల్లో అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఈ–పాస్ మిషన్లతో పోల్చినప్పుడు స్టాక్‌లో వ్యత్యాసాలు గుర్తించారు. రూ.15 లక్షల విలువ చేసే 60.18 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయాలను నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కె.శ్రీనివాసులు, జమాల్ బాషా, వ్యవసాయాధికారి వాసుప్రకాష్, డీసీటీఓ బి.సురేష్‌కుమార్, ఎస్ఐలు జి.గోపాలుడు, ఎస్.నరేంద్ర భూపతి పాల్గొన్నారు.

రక్తదానంతో రోగికి ప్రాణదానం


రక్తదానం చేస్తున్న పరుశురాముడు

గుంతకల్లు: అరుదైన 'ఓ' నెగిటివ్ రక్త దానంతో క్యాన్సర్ రోగికి ప్రాణదానం చేశాడు గుంతకల్లుకు చెందిన పరుశురాముడు. వివరాలు.. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన కేవీ లక్ష్మి హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అరుదైన 'ఓ' నెగిటివ్ (బాంబే బ్లడ్) గ్రూప్ ఉన్న ఆమెకు శస్త్రచికిత్స చేయాల్సి ఉండడంతో రక్తం అవసరమై కుటుంబసభ్యులు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్రల్లోని పలువురు రక్తదాతలను సంప్రదించారు. విషయం గుంతకల్లులోని ప్రాణదాత సేవా సమితి సభ్యులకు తెలియడంతో ఓ నెగిటివ్ బ్లడ్ కలిగిన పరుశురాముడుకు సమస్య వివరించారు. దీంతో ఆయన ఆదివారం స్థానిక గోపీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేయడంతో లక్ష్మి కుటుంబసభ్యుడు సురేష్ జాగ్రత్తగా తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా పరుశురాముడుని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రాణదాత సేవా సమితి సభ్యులు తిమ్మప్ప, హనుమంతు, హస్సేన్, బర్మాశాల రఘు, గఫూర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పరుశురాముడు మాట్లాడుతూ.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కేవలం 18 మంది మాత్రమే 'ఓ' నెగిటివ్ బ్లడ్ గ్రూప్ కలిగిన వారున్నారన్నారు. ఇందులో తరచూ ఆరుగురు మాత్రమే రక్త దానానికి ముందుకు వస్తున్నారని, ఇప్పటి వరకూ తాను 35 సార్లు రక్తదానం చేసినట్లు వివరించారు.

హెచ్‌ఎం అసోసియేషన్ నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

- జిల్లా అధ్యక్షుడిగా జయరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం (హెచ్‌ఎం) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా హెచ్‌ఎంల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం 2025–27 కాలానికి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయరామి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా హరినాథ్, గౌరవాధ్యక్షులుగా బాలమురళీకృష్ణతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా విజయభాస్కర్ రెడ్డి, మల్లికార్జున, నారాయణరెడ్డి, హెడ్‌క్వార్టర్ విభాగం కార్యదర్శిగా రోషన్‌బాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మదన్‌మోహన్ రెడ్డి, మహిళా విభాగం ప్రతినిధిగా వసుంధర, మునిసిపాలిటీ విభాగం ప్రతినిధిగా శామ్సన్, అనంతపురం డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా బీసీ సుంకన్న, జాయింట్ సెక్రటరీగా పీఆర్‌వీ ప్రసాద్, కళ్యాణదుర్గం డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఈ. గోవిందప్ప, జాయింట్ సెక్రటరీగా ఆదిశేషయ్య, గుంతకల్లు డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎం. సుంకన్న, జాయింట్ సెక్రటరీగా ఎం. శివ శంకర్ రెడ్డి, టెక్నికల్ కమిటీ సభ్యులుగా కే వెంకటప్రసాద్, గోపాల్ నాయుడు, అబ్దుల్ మునాఫ్, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎం. విశ్వనాథ్, సూర్యనారాయణ, శంకర్ రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

'అగ్నివీర్'కు 159 మంది అర్హత


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులు

తిరుపతి రూరల్: అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ రాత పరీక్షలో తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీకి చెందిన 159 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ మేరకు ఆ అకాడమీ చైర్మన్ బి.శేషారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. వీరికి ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇచ్చి, ఉద్యోగంలో చేరడానికి అవసరమైన సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాప్తాడు రూరల్: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ ఐజీ నగర్ (మబ్బుకొట్టాలు)కు చెందిన వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు ఐజీనగర్‌కు చెందిన ఈడిగ పాండు (42) కూలి పనులతో జీవనం సాగించేవాడు. భార్య అరుణాదేవి, ఓ కుమార్తె ఉన్నారు. ఈ నెల 21న ఉదయం 9.30 గంటలకు టిఫిన్ తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో వెళ్తుండగా ఆవులు అడ్డురావడంతో అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ రోజు నుంచి సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఇదేనా బాలికాభివృద్ధి?

- బతుకు తెరువు కోసం నగర శివారున భిక్షాటన
- చదువుకోవాల్సిన వయసులో చిత్తుకాగితాల సేకరణ



జోలె వేసుకుని భిక్షాటనకు వెళ్తున్న బాలికలు, నగర శివారులో చిత్తు కాగితాల కోసం వెతుకుతున్న బాలికలు

అనంతపురం ఎడ్యుకేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్న బాలికాభివృద్ధి ప్రకటనల్లో తప్ప చేతల్లో కనిపించడం లేదు. ఏటా ప్రత్యేక సర్వేలు నిర్వహించి బడిఈడు పిల్లలందరినీ గుర్తించి వారితో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడుల్లో చేర్పిస్తున్నారు. ఇందు కోసం రూ.లక్షల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. అయినా క్షేత్ర స్థాయిలో బడిఈడు పిల్లలు భిక్షాటనతో బతుకీడుస్తూనే ఉన్నారు. ఇందుకు నిదర్శనమే ఈ చిత్రాలు. నగర శివారులోని రాచానపల్లి వద్ద నలుగురు బాలికలు (అందరూ 10–12 ఏళ్లలోపు) జోలెలు భుజాన తగిలించుకుని భిక్షాటనకు వెళుతున్నారు. నగరంలో మరో ఇద్దరు బాలికలు సంచులు భుజాన వేసుకుని చిత్తుకాగితాల సేకరణలో నిమగ్నమయ్యారు. మరో బాలిక తల్లితో కలసి భిక్షాటనకు వెళ్తోంది. పుస్తకాలు పట్టుకుని చదువుకోవాల్సిన వయసులో బాలికలు భిక్షాటన చేయడం, చిత్తుకాగితాలు ఏరుకోవడం చూపరుల హృదయాలను కదిలిస్తున్నాయి. అవగాహన లేకపోవడం ఒక కారణమైతే, ఆ దిశగా ఎవరూ పట్టించుకోకపోవడం మరో కారణమని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని ఇలాంటి పిల్లలను గుర్తించి బలవంతంగానైనా బడిబాట పట్టించే చర్యలు తీసుకుంటే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భరించలేని దుర్వాసన


అనంతపురం మార్కెట్ యార్డులో పేరుకుపోయిన అపరిశుభ్రత

అనంతపురంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు పరిసరాల్లోకి వెళ్లగానే భరించలేని దుర్వాసనతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు ఎక్కడికక్కడ పేరుకుపోయింది. ప్రతి శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున గొర్రెలు, పొట్టేళ్లు, పశువులు, ఎద్దుల సంత జరుగుతుంది. వర్షపు నీటి నిల్వకు తోడు పెంట ఉండడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. దీంతో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తాచెదారం, పండ్ల వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. గత మూడు వారాలుగా ఇదే పరిస్థితి. మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నా... మౌలిక వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– అనంతపురం అగ్రికల్చర్:


అపరిశుభ్ర ప్రాంతంలో కట్టేసిన గేదెలు


గుట్టలా పేరుకుపోయిన పశువుల పేడ


మార్కెట్ యార్డులో సంచరిస్తున్న పశువులు


పెంట కుప్పల్లోనే పడేసిన పండ్ల వ్యర్థాలు

'దారి' దోపిడీ


టెండర్ లేకుండానే శ్రీనగర్ కాలనీ నీరు - ప్రగతి వనం పార్కు సమీపంలో వేసిన రోడ్డు


జనావాసాలు లేని చోట రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన రోడ్డు

- శ్రీనగర్ కాలనీలో టెండర్ లేకుండా జీటీ రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే అమిలినేని ఇంటికి వెళ్లేందుకు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు
- ఇప్పుడు బిల్లు చేసుకునేందుకు ఇంజినీర్ల ప్రయత్నాలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో 2014–19 సమయంలో అప్పటి టీడీపీ అధికారంలో ఉండగా ప్రజాప్రతినిధులు భారీగా ప్రజాధనం లూటీ చేశారు. అడ్డగోలుగా బిల్లులు చేసుకున్నారు.. అందినకాడికి దండుకున్నారు.. అందుకు అధికారులు కూడా అధికార పార్టీ నేతల అక్రమాలకు వెన్నుదన్నుగా నిలిచారు.. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది.. నిబంధనలు పక్కనబెట్టి ప్రజాప్రతినిధుల అండతో రూ.లక్షలు కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఏకంగా శ్రీనగర్ కాలనీలో ఎమ్మెల్యే అమిలినేని నివాసానికి వెళ్లేందుకు టెండర్ లేకుండా రూ.29లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కుమార్తె వివాహం ఈ ఏడాది మే 16న జరిగింది. సదరు ఎమ్మెల్యే నివాసం శ్రీనగర్ కాలనీలోనే ఉంది. ఎమ్మెల్యే నివాసానికి గవర్నర్‌తో పాటు మంత్రి నారా లోకేష్, ప్రముఖులు వస్తారని, శ్రీనగర్ కాలనీలోని నీరు–ప్రగతి వనం సమీపంలో ఆగమేఘాలపై బీటీ రోడ్డు నిర్మించారు. వాస్తవంగా బీటీ రోడ్డు వేసిన ప్రాంతంలో జనావాసాలు లేవు. అత్యాధునిక హంగులతో రోడ్డు తీర్చిదిద్దారు. నగరంలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా ఉన్నా.. పట్టించుకునే పరిస్థితి లేదు. కానీ టెండర్ లేకుండానే రోడ్డు వేసేశారు. బీటీ రోడ్డు ఏర్పాటుకు రూ.29 లక్షల వరకు ఖర్చు అయినట్లు అధికారులు కూడా రికార్డులు సిద్ధం చేశారు.

బిల్లుల కోసం ఓ డీఈ ప్రదక్షిణలు..

ప్రస్తుతం నగరపాలక సంస్థలోని ఓ డీఈ దొంగ బిల్లులు చేసుకుంటుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు తమ్ముళ్లు ఏం చెప్పినా.. ఆయన జీ హుజూర్ అంటూ అడ్డగోలు పనులకు అండగా నిలుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీనగర్ కాలనీలో టెండర్ లేకుండానే వేసిన రోడ్డుకు రూ.29 లక్షలు బిల్లు చేసుకోవాలని మేయర్ వసీం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇన్‌యాంటిసిపేషన్ లెటర్‌పై సంతకం చేయాలని నెల రోజులుగా మేయర్‌ను బతిమాలుతున్నట్లు ఇంజినీరింగ్ విభాగంలో ఈ విషయం పెద్ద చర్చనీయాంశమైంది. దీనిపై ముందస్తుగా ఇన్‌యాంటిసిపేషన్ సంతకాన్ని మేయర్‌తో తీసుకుని కమిషనర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, తదితరులతో సంతకం తాను చేయించుకుంటానని చెబుతున్నాడు.

కలెక్టర్ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో...?

టెండర్ లేకుండా చేసిన పనులకు చిల్లిగవ్వ రాదు. దీంతో పాటుగా సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. 2014–19 సమయంలోనూ 32వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి ఇంటి వద్ద టెండర్ లేకుండా రూ.10 లక్షలతో అప్పటి తెలుగు తమ్ముళ్లు రోడ్డు వేశారు. ఆ విషయంలో అప్పట్లో పని చేసిన అధికారులు జిల్లా కలెక్టర్‌తో చివాట్లు తినడమే కాకుండా సస్పెన్షన్ వరకు వెళ్లింది. మరీ అదే సంస్కృతిని డీఈ తీసుకురావడం పెద్ద చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఇలాంటి వాటికి చెక్ పెట్టేలా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

క్లుప్తంగా

తాగునీరు వృథా


పైపులైన్ పగిలిపోవడంతో రోడ్డు వెంబడి వృథాగా పోతున్న తాగునీరు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో పలుచోట్ల తాగునీరు వృథాగా పోతోంది. దీంతో స్థానికులు తాగునీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ధర్మవరానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పంచాయతీ బోరు పైపులైన్ పగిలి నీరంతా రోడ్డు వెంబడి వెళ్తోంది. దీనిపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీరు వృథాగా పోవటంతో పాటు ఆ నీరంతా స్థానిక ప్రభుత్వ పాఠశాల ముందుకు చేరుతుండటంతో బురద నీటిలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్ప సేవా సమాజ్ తాత్కాలిక కమిటీ ఎంపిక

అనంతపురం కల్చరల్: కొంత కాలంగా వివాదాస్పదంగా మారిన పాతూరు చెరువుకట్ట అయ్యప్ప సేవా సమాజ్ నూతన కమిటీ ఎంపిక ఆదివారం సాయంత్రం జరిగింది. 400 మంది అయ్యప్ప మాలధారులు సమావేశమైన నూతన తీర్మానాలను ఆమోదించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు గుజరీ వెంకటేశులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాత్కాలిక అధ్యక్షుడిగా గజేంద్ర మోహన్‌ను ఎంపిక చేశారు. త్వరలో పూర్తి స్థాయి కమిటీని ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాత కమిటీ ప్రధాన కార్యదర్శి నాగలింగారెడ్డి, జాయింట్ సెక్రటరీ కేశవ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ, రాము, గురుస్వామి రంగా చారి, భవాని, శబరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నిరంతర వైద్య విద్యతో నూతన ఆవిష్కరణలు

- ఏఓజీఎస్ అధ్యక్షురాలు డాక్టర్ షంషాద్‌బేగం


వర్క్‌షాపునకు హాజరైన గైనకాలజిస్టులు

అనంతపురం మెడికల్: నిరంతర వైద్య విద్యతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని అబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజి సొసైటీ (ఏఓజీఎస్) అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ షంషాద్ బేగం, డాక్టర్ నిస్సీ వినూత్న పేర్కొన్నారు. ఆదివారం ఐఎంఏ హాల్‌లో ఆధునిక అల్ట్రాసౌండ్ సాంకేతిక పరిజ్ఞానంపై వర్క్‌షాప్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి డాక్టర్ ఆర్తి దీనదయాల్, డాక్టర్ శిల్పాలు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రసూతి, స్త్రీ సమస్యలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఏవిధంగా గుర్తించి తదుపరి చర్యలు తీసుకోవచ్చని నిశితంగా తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు డాక్టర్ అరుణ, డాక్టర్ నాగరజ్యోతి, డాక్టర్ కృష్ణశ్రీ, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రేణుక, డాక్టర్ షబానా, డాక్టర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా సినీ సంగీత విభావరి


పాత పాటలతో ఉర్రూతలూగించిన గాయకులు

అనంతపురం కల్చరల్: తెలుగు సినీ సంగీతలోకానికి చిరస్థాయి గుర్తింపు తెచ్చిన అలనాటి మధుర గాయకుడు రామకృష్ణ జయంతి సందర్భంగా ఆయన స్మారక గీతాలతో కళాకారులు శ్రోతలను రంజింపజేశారు. పాత పాటల ప్రేమికుల బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సినీ గీతాలహరి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హౌసింగు బోర్డులోని ఘంటసాల స్మారక మందిరంలో జరిగిన సంగీత విభావరిలో పలువురు గాయనీ గాయకులు పలు పాత చిత్రాలలోని అలనాటి మధుర గీతాలతో ఉర్రూతలూగించారు. 'ఘనా ఘన సుందర, ఆకాశం దించాలా, ప్రియురాల సిగ్గేలనే..' పాట లు ఆకట్టుకున్నాయి. అనంతరం ఘంటసాల రామయ్యను సన్మానించారు. అంతకు ముందు ఆత్మీయ అతిథులు, అధికారులు మల్లోల, రంగస్వామి, సంస్థ నిర్వాహకులు ఓబుళదాసు, జీవీ రామయ్య, ఆచార్య సుధాకరబాబు, కేశవ, విజయలక్ష్మి, బృంద, శ్రీదేవి మధుర గాయకుడు రామకృష్ణ పాటల విశిష్టతను తెలియజేస్తూ మధురగానంతో నీరాజనాలర్పించారు.

నేడు 'ప్రజా వేదిక'

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ కార్యాలయంలో ఉండి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తీసుకుని సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్న దృశ్యం



అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరులో గోవింద భజన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయకుల పంపిణీ ఆదివారం జరిగింది. గోవింద సేవా సంఘం అధ్యక్షుడు ఇరటి రమణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దూపగుంట్ల శబరి చేతుల మీదుగా వందలాది విగ్రహాలను నగరవాసులకు అందించారు. రాజా రాఘవేంద్ర, బైనగారి రమేష్, పుట్లూరు కాశి, మణికొండ రవి, జయంతి ప్రసాద్, వెంకటేశ్వర బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవకుల ఆధ్వర్యంలో : స్థానిక శ్రీనివాసనగర్‌లోని సీతారామాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్త ఆళ్లగడ్డ రాము నేతృత్వంలో శ్రీవారి సేవకులు ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ చేశారు. విగ్రహంతో పాటు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కాకుండా క్లాత్ బ్యాగ్ కూడా ఇచ్చామన్నారు. పర్యావరణ హితం కోసం అనేక ఏళ్లగా మట్టి వినాయకులనిస్తున్నట్లు సభ్యులు ప్రకాష్ ముఖేష్, శివ, శంకురెడ్డి, అనిల్‌ప్రసాద్, సురేష్ తెలిపారు.

వర్ధమాన రచయితలు..సమాజ నిర్దేశకులు

- ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి


ద్విదశాబ్ది పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య రాచపాలెం తదితరులు

అనంతపురం కల్చరల్: వర్ధమాన రచయితలు సమాజ నిర్దేశకులని ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు.ఆదివారం స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి సంపాదకత్వంలో వెలువడిన 'ద్విదశాబ్ది' పుస్తకావిష్కరణ ఆర్ట్స్‌కాలేజ్ ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ జీవితం మీద నమ్మకం, ఆశ కలిగించేదిశగా రచనలు చేస్తున్న కవులను సత్కరించి, వారి వ్యాసాలను గ్రంథస్థం చేసిన చం.శాస్త్రి కృషి అభినందనీయమన్నారు. అదేవిధంగా జనప్రియ కవి ఏలూరు యంగన్న, డాక్టర్ అంకె శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేత కృపాకర్ మాదిగ, నందవరం కేశవరెడ్డి, డాక్టర్ నాగేశ్వరాచారి తదితరులు పుస్తక విశిష్టతలపై మాట్లాడారు. ఈసందర్భంగా కవి రాజారామ్ ఆధ్వర్యంలో జరిగిన కవిసమ్మేళనంలో కవులు షమీవుల్లా, నరిసిరెడ్డి, మధురశ్రీ, శ్రీనివాస్, కృపాకర్, రాఘవేంద్ర, విశ్వనాథరెడ్డి తదితరులు చక్కటి కవితాగానంతో ఆకట్టుకుని సత్కారాలనందుకున్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు కూరపాటి రంగనాయకులు, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, అక్షరమాలి సురేష్, గొల్లాపిన్ని సీతారామశాస్త్రి, జెట్టీ జయరామ్, వీరభద్రప్ప, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడం పునర్జన్మతో సమానం

- బ్రహ్మకుమారీ జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారద


రక్తదాతకు పండ్లు అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: రక్తదానం చేయడం పునర్జన్మతో సమానమని ఈశ్వరీయ బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారద పేర్కొన్నారు. ఆదివారం రాజయోగిని దాది ప్రకాశమణిజీ జ్ఞాపకార్థం ఈశ్వరీయ ప్రజాపతి బ్రహ్మమారీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ప్రారంభమైంది. ఈశ్వరీయ బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారద నేతృత్వంలో పాతూరులోని బ్రహ్మకుమారీల ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ పరదేశీనాయుడు, డీఆర్‌డీఏ పీడీ శైలజ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల వైద్యులు మహ్మద్ గౌస్, మాలిక్, శివకుమార్, సాయి సంస్థ విజయ్‌సాయికుమార్ పాల్గొని మాట్లాడారు. సిస్టర్ శారదా మాట్లాడుతూ సోమవారం రక్తదానం కొనసాగుతుందని తెలిపారు. జిల్లా లోని బ్రహ్మకుమారీల ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో నటీనటుల సందడి


సినీ నటులు జగదీష్, కల్పలతలను సన్మానించిన దృశ్యం

ఆత్మకూరు: పుష్ప సినిమా నటీనటులు ఆదివారం ఆత్మకూరులో సందడి చేశారు. కేశవా క్యారెక్టర్ చేసిన జగదీష్, పుష్ప సినిమాలో అల్లుఅర్జున్ తల్లిగా నటించిన కల్పలత ఆత్మకూరు ఆర్డీటీ క్రీడా మైదానంలో జరిగిన సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆత్మకూరు నుంచే కాకుండా చుట్టు పక్కన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వారిని చూడటానికి ప్రజలు తరలివచ్చారు. వారితో సెల్ఫీలు దిగారు. సాయంత్రం ఆత్మకూరు గ్రామస్తులు వారిద్దరినీ ఘనంగా సత్కరించారు. ఆత్మకూరులో సినిమా షూటింగ్ చేయడం ఆనందంగా ఉందని, ఇక్కడి ప్రజల అభిమానం మరువలేనిదని వారు తెలియజేశారు.

ప్రశాంత ఉత్సవాలకు సహకరించాలి


మాట్లాడుతున్న అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలు సహకరించాలని అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాస రావు తెలిపారు. ఆదివారం అనంతపురం డీఎస్పీ కార్యాలయంలో వినాయక ఉత్సవాల నేపథ్యంలో అన్ని మతాల పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో నగర పోలీసులు శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గణేష్ మంటపాలు, పందిళ్ల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా సభ్యులు బాధ్యత వహించాలని, ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలన్నారు. ఇతర మతాల వారికి ఎలాంటి ఇబ్బందులకు కలగజేయకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.2 కోట్లు ఎగవేతపై ఫిర్యాదు

అనంతపురం కార్పొరేషన్: అట్లాంటాలో ఉన్న ఎన్ఆర్ఐ సురేంద్రబాబు రూ.2 కోట్లు ఇవ్వకుండా మోసం చేశారని, సదరు వ్యక్తిపై జిల్లా ఎస్పీ, నాల్గో పట్టణ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇంటీరియర్ డిజైనర్ శరత్ పేర్కొన్నారు. ఆదివారం రుద్రంపేట సమీపంలో బాధితుడు శరత్ విలేకరులతో మాట్లాడారు. నగరానికి చెందిన మహేష్ (సురేంద్రబాబు బంధువు) అనే వ్యక్తి తనకు చిన్ననాటి మిత్రుడని, అతనికి 5 సెంట్ల స్థలం ఉండగా, అందులో లాడ్జ్ నిర్మాణ బాధ్యతలను తాను చేపట్టానన్నారు. అదే లాడ్జ్ పక్కనే ఎన్ఆర్ఐ సురేంద్రబాబుకు 11 సెంట్ల స్థలం ఉందని, అందులో ఇంటిని నిర్మించి ఇవ్వాలని మహేష్ ద్వారా సురేంద్రబాబు తనను సంప్రదించాడన్నారు. అందుకు రూ.4 కోట్లు ఖర్చవుతుందని చెప్పామని, మొదట్లో రూ.2 కోట్ల వరకు చెల్లించిన సురేష్‌బాబు ఆ తర్వాత డబ్బులు చెల్లించకుండా పత్తా లేకుండా పోయాడన్నారు. తన సెల్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాడని, ఇదే విషయమై జిల్లా ఎస్పీ జగదీష్, నాల్గో పట్టణ పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సురేష్ బాబు తనకు డబ్బు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని, నమ్మకద్రోహి సురేంద్రబాబుపై అమెరికా ఎంబసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థినీ విద్యార్థులకు ఆరంభ్–2025 ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంబశివారెడ్డితోపాటు కళాశాల చీఫ్ అడ్వైజర్ ఈఎస్ చక్రవర్తి హాజరయ్యారు. ముందుగా వారు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్ చదవడానికి మంచి కళాశాలను ఎంచుకోవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. టీపీఓ రంజిత్‌రెడ్డి , ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో పోలీసులు ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్‌తో పాటు చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ, కనగానపల్లి ఎస్ఐ రిజ్వాన్ పాల్గొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి 44వ నంబరు జాతీయ రహదారి వరకూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. సైకిల్ తొక్కడం ద్వారా కండరాలు చురుగ్గా పనిచేయడంతో పాటు ఫిట్‌గా మారుతాయన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించుకొని విధిగా సైక్లింగ్ చేయాలన్నారు.

వినాయక చవితి కానుక అందజేత


వినాయక చవితి కానుక అందిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ఆదరణ సేవా హోంలో చంద్రయాన్ సేవా సమితి ఆధ్వర్యంలో హిందువులకు వినాయక చవితి కానుకలను దిశ డీఎస్పీ మహబూబ్‌బాషా, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకతీతంగా చంద్రయాన్ సేవా సమితి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యులు జిలాన్ బాషా, లాల్‌బాషా పాల్గొన్నారు.

సందడిగా 'నా మేనత్త కూతురే' పాటల విడుదల

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన డాన్స్ మాస్టర్ దాసరి బాలు నేతృత్వంలో రూపొందించిన ' నా మేనత్త కూతురే ' పాటల విడుదల కార్యక్రమం సందడిగా సాగింది. ఆదివారం స్థానిక రామచంద్రానగర్‌లోని నీలిమ థియేటర్‌లో డాన్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు మురళీకృష్ణ, రమేష్, ప్రైవేట్ పాఠశాలల అధినేతలు సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శంకర్ నారాయణ తదితరులు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమాకు ఏ మాత్రం తీసిపోని విధంగా ప్రైవేటు ఆల్బమ్స్‌ను, లఘుచిత్రాలను నిర్మించడం ముఖ్యంగా కొరియోగ్రఫీలో వినూత్న ప్రయోగాలు అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ జ్యోత్స్న, ఎండీ అబ్బు, అరుణ్ కీస్, దుర్గ తమ్మినేని, కార్తీక్, ఉదయ్‌కుమార్, రాజశేఖర్ జగదీష్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: క్రీడలతో మానసిక, శారీరక వికాసం కలుగుతుందని పీటీసీ ఏఎస్పీ మల్లికార్జున వర్మ అన్నారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17వ ఇషా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలను ఏఎస్పీ మల్లికార్జున వర్మ, పీటీసీ సీఐ ఆర్.ప్రతాప్ రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జున వర్మ మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి మంచి క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఇషా ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. ఈ క్రీడా పోటీలకు 22 జట్లు రావడం సంతోషదాయమకన్నారు. ఫైనల్ పోటీల్లో విజేతలకు క్యాష్ ప్రైజ్ అందిస్తారన్నారు. జిల్లా స్థాయిలో గెలిచిన జట్టు రాష్ట్ర స్థాయిలో విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. అనంతరం సెప్టెంబర్ 21,22 తేదీల్లో కోయంబత్తూరు ఇషా ఫౌండేషన్‌లో నిర్వహించే ఫైనల్ స్థాయిలో గెలుపొందిన వారికి రూ.5 లక్షల బహుమతిని అందజేయనున్నారు.

పంపనూరులో పూజలు

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆకుపూజ చేశారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి అభిషేకాలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షణ చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ, రాహుకేతు హోమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న చిన్నారులు


సంచులాట ఆడుతున్న బాలబాలికలు


కప్పలాగా గెంతే ఆట

చెన్నేకొత్తపల్లి: ఆటలతో చిన్నారులకు ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని టింబక్టు కలెక్టివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య అన్నారు. టింబక్టు కలెక్టివ్ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న చిగురు సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సీఫైఆర్సీ ప్రాంగణంలో ఆదివారం ఆటల పండుగ నిర్వహించారు. సంచులాట, కప్పలాగ గెంతడం, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ లాంటి ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన బాలబాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిగురు సిబ్బందితో పాటు బాలబాలికలు పాల్గొన్నారు.